క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ

వైవీయూ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ తిరుపతి నగరంలో నిర్వహించనున్న 'స్టూడెంట్ మేనిఫెస్టో' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను ఏబీవీపీ నాయకులు ఆవిష్కరించారు. శుక్రవారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏబీ వీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థి సమస్యలను తెలియజేసేలా మేనిఫెస్టో సభ ఉంటుందన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈనెల 3వ తేదీన పల్స్ పోలియో కార్య క్రమంలో భాగంగా ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కల మందు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, వైద్యాధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాయల్ రషీద్ అసోసియేషన్ ప్రతినిధి కరీముల్లా ప్రచురించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు.

మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి

వైవీయూ : మొక్కల సంరక్షణ వలంటీర్లు బాధ్యతగా తీసుకోవాలని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి కోరారు. శుక్రవారం వైవీయూ క్యాంపస్‌లో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో మామిడి మొక్కలను, జామ మొక్కలను నాటించే కార్యక్రమం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రెడ్డయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలోని రైతుల సంక్షేమ దిశగా ఎన్నికల మేనిఫెస్టోలు ఉండాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే .ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతుల సంక్షేమ ఎన్నికల మేనిఫెస్టో అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో రైతాంగానికి లబ్ధి చేకూర్చే విధంగా ఎన్నికల మేనిఫెస్టోలు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి, అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్, సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్లకు కొత్త రేట్లు అమలు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్‌కు కొత్త కూలీ రేట్లు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ కార్గో ఆవరణలో ఏపీఎస్ ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్ ఫెడరేషన్ కడప శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్గోలో లోడింగ్, అన్ లోడింగ్ పనులు నిర్వహించే హమాలీ పోర్టర్స్‌కు ఎగుమతి, దిగుమతి కూలీ రేట్లు పెంచి రెండు సంవత్సరాలు దాటిపోయిందన్నారు. కార్మికులకు గత అగ్రిమెంటు ప్రకారం కొత్తకూలీ రేట్లు పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఏపీఎస్ ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా కార్యదర్శి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ధర అందుబాటులోకి తీసుకురావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: సిమెంట్ ధరలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా లభ్యమయ్యే నాపరాయి ఆధారంగా సిమెంటు పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు, ఇల్లు త్యాగం చేసిన జిల్లా ప్రజలకు సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు సిండికేట్ తో సిమెంటు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. సిమెంటు ఉత్పత్తికి అవసరమైన వనరులన్నీ జిల్లా నుండి పొందుతున్న యాజమాన్యాలు జిల్లా ప్రజలకు మాత్రం అధిక ధరలకు విక్రయించడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసి బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు మునెయ్య పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే జగనన్నకు మద్దతు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 32 వ డివిజన్ పరిధిలోని హాబీబుల్లా స్ట్రీట్‌లోని పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వంలో వారు పొందిన లబ్ధి సమాచారంతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు.

– ఈ సందర్భంగా శివ సుబ్బమ్మ అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ బీమా, వైఎస్ఆర్ పింఛన్ కానుక, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, జగనన్న అమ్మ ఒడి, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.17 లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది.

– సయ్యద్ రమీజా అనే మహిళ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.8.82 లక్షల లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేసింది.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ

అంతకుముందు 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల నుండి రూ.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైన్ కాలువకు ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా భూమి పూజ చేశారు.

– ఈ కార్యక్రమంలో హరూన్ గ్రూప్ ఎండీ అహ్మద్‌బాషా, 32వ డివిజన్ కార్పొరేటర్ జఫ్రుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, జయచంద్రా రెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, తోట క్రిష్ణ, రామ్మోహన్ రెడ్డి, సుభాన్‌బాషా, ఆరీఫుల్లా బాషా, లక్ష్మీనారాయణ, మహిళా నేతలు పత్తి రాజేశ్వరి, మూలే సరస్వతి, మరియలు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథుని కాంప్లెక్స్‌లో ప్రాచీన దేవాలయమైన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 9వ రోజు శుక్రవారం రాత్రి శ్రీరంగనాథస్వామి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. స్వామి వారికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం నాటితో శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీకర్ రెడ్డి, ఈఓ కె.వి.రమణ పాల్గొన్నారు.



వైభవంగా శివదీపోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివదీక్షా బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా శివదీపోత్సవం నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం, గణపతి, నవగ్రహ, రుద్రస్వాహాకార హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం అగస్త్యేశ్వరస్వా మి, రాజరాజేశ్వరి మాత ఉత్సవ విగ్రహాలను వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు దీపాలతో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పాల్గొన్నారు.



ఆర్బీకేలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సిద్దవటం : రైతు భరోసా కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు సిబ్బందికి సూచించారు. మండలంలోని బొగ్గిడివారిపల్లి రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతు భరోసా కేంద్రంలోని ఈ –పంట నమోదు రిజిస్టర్, ఎరువుల పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ రైతులు డ్రిప్ పరికరాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు, కళ్లం పట్టలు యంత్ర పరికరాలు సబ్సిడీపై కావాలని అడిగారన్నారు. ఆర్బీకేలను పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో మిరప, నువ్వుల పంటలను పరిశీలించి మిరపలో ఆకు ముడత వైరస్ తెగులు సోకిందని, దీని నివారణకు డిలిగేట్ అనే మందును పిచికారీ చేసుకోవాలని తెలిపారు. జిగురు పూసిన పసుపు, నీలం పల్లాలను ఎకరాకు 40 చొప్పున పంట పైభాగం అర అడుగు ఎత్తులో ఉంచితే రసం పీల్చు పురుగుల నివారణకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈనెల 2న ఈ–పంట నమోదుపై సోషల్ ఆడిట్ నిర్వహించి రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు.



మిరప పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

మోడల్ స్కూల్‌లో 6వ తరగతికి దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ వెలువడినట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొందిన విద్యార్థులు దీనికి అర్హులని తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి వుంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21వ తేదీన పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ మేరకు సీట్లు కేటాయిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

21న ప్రవేశ పరీక్ష

చిన్నమండెం : ఏపీ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న పత్రాలను తమకు అందజేయాలని ఆయన తెలియజేశారు.

ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా రాజారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్: రామేశ్వరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా మార్తల రాజారెడ్డి శనివారం ఆలయంలో ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ధర్మకర్తలుగా సన్నుతి శ్రీనివాసులు, కామిశెట్టి సుప్రియ, డాక్టర్ నల్లపోతుల కాత్య, యల్లనూరు జ్యోత్స్న, ఎం.తులశమ్మ, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా బీ.రాజశేఖర్ శర్మ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి పాల్గొననున్నారు.

డ్యామ్‌లకు మరమ్మతు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలో నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యామ్‌లకు మరమ్మతు చేయాలని డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని కాలేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ మేడిగడ్డ బ్యారేజ్ ప్రమాదంలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యామ్‌ల లీకేజీలు ఉన్నాయన్నారు. వీటికి మరమ్మతులు తక్షణమే చేయాలని కోరారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

వేంపల్లి : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ వారు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక రంగంలో నిత్య జీవితంలో జరిగే విపత్తులను, ఉపద్రవాలను అరికట్టడంతో సైబర్ సెక్యూరిటీ యొక్క ఆవశ్యకతను విభిన్న ఉదాహరణల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ సెక్యూరిటీ యొక్క ప్రాముఖ్యతను వ్యక్తి తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. బ్యాంకుల ద్వారా విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని, స్కాలర్షిప్‌లను విపులంగా వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, పీడీ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ రమాదేవి

నిండు జీవితానికి రెండు చుక్కలు

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం వైద్యాధికారి వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీన 5 సంవత్సరాల లోపు పిల్లలందరికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. నందిమండలం పీహెచ్‌సీ పరిధిలో 43 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, ఎం.పి.హెచ్.ఈ.ఓ రామప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నందిమండలంలో పల్స్ పోలియోపై ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

ఆరోగ్య సురక్ష కేంద్రం తనిఖీ

చింతకొమ్మదిన్నె : మండలంలోని పాపా సాహెబ్‌పేట పరిధి సచివాలయంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.నాగరాజు సందర్శించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న డ్రైడేను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలోని ప్రజలు ప్రతి ఒక్కరూ మురుగు నీటిని నిల్వలేకుండా తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీకేదిన్నె వైద్యుడు డాక్టర్ రాఘవేంద్ర, జిల్లా సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి సుకుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి ప్రసాదు, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

చాపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. మల్లేష్ సూచించారు. మండలంలోని మడూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు సైతం స్పెషలిస్టు వైద్యులతో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని, రోగులకు అవసరమైన అన్ని రకాలైన మందులు ఇస్తున్నారని తెలిపారు. అనంతరం కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని సందర్శించి ఆప్తాలమిక్ ఆఫీసర్ రఘురామిరెడ్డి అందిస్తున్న కంటి వైద్య పరీక్షలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారికి అవసరమైన విధంగా కంటి అద్దాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజేష్ కుమార్, కావ్యమాధురి, ఆశా నోడల్ ఆఫీసర్ సుకన్య, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆర్ఐఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి వేంపల్లి బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో జోరుగా కాపీయింగ్ జరుగుతోందని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ ఆరోపించారు. ఈ విషయమై శుక్రవారం ఆర్ఐఓ వెంకటసుబ్బయ్యను కలిసి కాపీయింగ్‌ను అరికట్టాలని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షుడు హరిబాబు, కన్నయ్య పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థి తమ ఇంట్లో ఉండే చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలను వేయించాలని రూట రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్ఎండి అయూబ్ అన్నారు. రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన పల్స్‌పోలియో కరపత్రాలను శుక్రవారం కడప మున్సిపల్ ఉర్దూ బాలుర పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, సైన్సు ఉపాధ్యాయులు ఖాజామైనుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని జిల్లాకు చెందిన బీజేపీ నేతలు శశిభూషణ్‌రెడ్డి, సింగారెడ్డి రామచంద్రారెడ్డిలు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి కడప నగరంలోని రాజీవ్ పార్కువద్ద ప్రజాపోరు–2 ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొమ్మన సుబ్బరాయుడు, బాలకృష్ణ యాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాల మధ్య నిర్వహించుకునేందుకు కృషి చేయాలని జేబీవీఎస్ ది ప్రిసెర్వర్ సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం సేవా సమితి ఎగ్జిక్యూటివ్ మెంబర్ సిరి చందన జన్మదినాన్ని పురస్కరించుకుని కడప నగరం ప్రకాష్ నగర్‌లోగల జేఎస్ఓఎస్ ఆర్గనైజేషన్‌లో ఉన్న 70 మంది పిల్లలతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు బిస్కెట్లు, స్నాక్స్ అందజేశారు. బియ్యం ప్యాకెట్లను అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వేగేటు మూత

ముద్దనూరు : ముద్దనూరు–జమ్మలమడుగు ప్రధాన రహదారిలోని స్థానిక రైల్వే గేటు(లెవెల్ క్రాసింగ్ గేట్)ను నేటినుంచి తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి 5వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం రైల్వే గేటను మూసివేస్తున్నట్లు తెలిపారు. జమ్మలమడుగుకు ప్రయాణించే వాహనాలు ఈ మార్గంలో సంచరించడానికి వీలుండదని స్థానిక ప్రజలు గమనించాలని రైల్వే అధికారులు తెలిపారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

పులివెందుల రూరల్ : ఈనెల 8న మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ డీఎం చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని పులివెందుల డిపో నుంచి పొలతల క్షేత్రానికి 27 బస్సు సర్వీసులు, భానుకోటకు 3 బస్సు సర్వీసులు, అలాగే ఈ నెల 12, 13 వ తేదీలలో లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరకు 18 బస్సు సర్వీసులను నడుపుతున్నామని తెలిపారు.

అలాగే పులివెందుల ప్రాంతంలోని శైవ క్షేత్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతామన్నారు. పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి నంద్యాల ఆర్టీసీ డిపోకు శ్రీశైలం పంపేందుకు బస్సులను ఆ డిపోకు పంపిస్తామన్నారు.

నేడు కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీ నాగుల క్షేత్రంలో శనివారం శ్రీ అశ్వర్థ నారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ క్షేత్రం 28వ వార్షికోత్సవ సందర్భంగా ఉదయం 9 నుంచి ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల వరకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అంతకుముందు గణపతిపూజ, పుణ్యాహవాచనం, అనంతరం 10 గంటలకు ప్రత్యేకంగా సర్వశాంతి హోమం, అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నారు.

దూదేకుల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న దూదేకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. బాదుల్లా

కడప కార్పొరేషన్: నూర్ బాష్ దూదేకుల ముస్లింల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా, జిల్లా అధ్యక్షుడు పగిడాల పెద్దన్నలు కోరారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కడపలోని అపూర్వ ఫంక్షన్ హాల్‌లో మార్చి 3 వ తేదీ ఉదయం 10 గంటలకు నూర్ బాష్ దూదేకుల ముస్లిం ఆత్మీయ సమావేశం జరుగనుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎంపీ వైస్ అవినాష్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, దూదేకుల చైర్మన్ ఓ. రసూల్ వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్ బాషాలు హాజరై ప్రసంగిస్తారన్నారు.

త్రికాల పూజలు



స్వామి ఆశీర్వాదం అందుకుంటున్న భక్తులు

కడప కల్చరల్ : కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీస్వామి శుక్రవారం కడప నగర శివార్లలోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో త్రికాల పూజలు, అభిభాషణం చేశారు. తన విజయయాత్రలో భాగంగా ఆయన గురువారం నుంచి ఆలయంలో పూజోత్సవాలు నిర్వహిస్తున్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు స్వామి తురీయానంద పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్వామి శంకర విజయేంద్ర సరస్వతి శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి స్ఫటిక శివలింగం రూపానికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంతోపాటు సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు, ప్రముఖులు, వ్యాపారులు, ఉద్యోగులు, అధికారులు భారీగా స్వామిజీని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. వచ్చిన భక్తాదులను స్వామీజీ ఆశీర్వదించారు. శుక్రవారం కావడంతో స్వామిజీ ఆధ్వర్యంలో త్రికాల అభిషేక పూజతో పాటు మహిళా భక్తులచే సువాసిని పూజలను ప్రత్యేకంగా నిర్వహించారు. శనివారం కూడా స్వామిజీ పూజలు నిర్వహించనున్నారు.

షార్ పరిశోధన కేంద్రంలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



శ్రీహరికోట స్పేస్ సెంటర్ వద్ద కడప ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ: శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌ను కడప ప్రభుత్వ పురుషుల కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు సందర్శించారు. క్షేత్రపర్యటనలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థుల బృందం ఇస్రో కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మనోహర్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రాజు, రేణుకాదేవి, సుభాని, గోవర్దన్, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కమలాపురం : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. శుక్రవారం ఫస్టియర్ విద్యార్థులకు తెలుగు పరీక్ష కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య అధికారులు నిర్వహించారు. పట్టణంలోని గురుకుల పాఠశాల, పీవీఎస్ఆర్ఎం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. కాగా గురుకుల కేంద్రంలో 259 మంది విద్యార్థులకు గాను 238 మంది హాజరయ్యారని, 21 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ తులశమ్మ, డిపార్ట్‌మెంట్ అధికారి చంద్రఓబుళరెడ్డి తెలిపారు. అలాగే పీవీఎస్ఆర్ఎం కళాశాల కేంద్రంలో 176 మందికి 163 మంది హాజరయ్యారని 13 మంది గైర్హాజరయ్యారని చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు. రెండు కేంద్రాల్లో 435 మందికి 34 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

నేడు యల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

వీరపునాయునిపల్లె: మండలంలోని అలిదెన ఓబాయపల్లె గ్రామంలో శనివారం యల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరగనున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. ఈ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొననున్నట్లు ఆయన తెలియజేశారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.